క్లుప్తంగా

నేతన్నల కష్టాన్ని గౌరవించాలి

కడప కల్చరల్ : మన ప్రాంత వాతావరణానికి తగినట్లుగా వస్త్రాలను తయారు చేసి ఇస్తున్న నేతన్నల కష్టాన్ని గుర్తించి గౌరవించాలని నాబార్డు సంస్థ ప్రతినిధులు కోరారు. సంస్థ పక్షాన స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో దాస్ ఎడ్యుకేషనల్ అండ్ సొసైటీ ఆధ్వర్యంలో చేనేతలు, కళాకృతులు రూపొందించే సంస్థల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ స్టాల్స్‌ను తిలకించేందుకు, ఈ దుస్తుల తయారీ వెనుక నేతన్నల కష్టాన్ని వివరించేందుకు విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు సొసైటీ నిర్వాహకులు తెలిపారు.

ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక


రవిశంకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఆర్‌ఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడిగా వెనుతుర్ల రవిశంకర్‌రెడ్డి ఎన్నికయ్యాడు. కడప నగరంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఆర్‌ఎస్‌యూ 9వ రాష్ట్ర మహాసభల సందర్భంగా 12 మందితో రాష్ట్ర కార్యవర్గం ఎన్నుకున్నారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడిగా రవిశంకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నాగరాజు, రాష్ట్ర కోశాధికారి క్రిష్టారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు, మునిరెడ్డి, అవినాష్, చరణ్, మణికంఠ, చెన్నకేశవరెడ్డి, బిమేష్ తదితరులను ఎన్నుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాధవి, తదితరులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ఆర్అండ్‌బి ఎంప్లాయిస్ అసోసియేషన్ అమరావతి -2024కు సంబంధించిన క్యాలెండర్‌ను బుధవారం కడపలోని ఆర్అండ్‌బి జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆర్అండ్‌బి ఉప పర్యవేక్షణ ఇంజనీర్ మాధవి ఆధ్వర్యంలో ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఇంజనీర్లు, సంఘ నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కు 'బి' సర్టిఫికెట్ ప్రదానం

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్‌కు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా చేతుల మీదుగా ఎన్‌సీసీ 'బి' సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో నిర్వహించే ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం తిరుపతి 5 ఆంధ్ర బెటాలియన్‌కు చెందిన సుబేదార్ కైలాస్‌కుమార్, హవల్దార్ యు.వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో కేడెట్స్‌కు డ్రిల్‌పై పరేడ్ నిర్వహించారు. అనంతరం 42 మంది ఎన్‌సీసీ కేడెట్స్‌కు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సీటీఓ డి. విన్నీతేజ, కేడెట్స్ పాల్గొన్నారు.

తగిన ఆధారాలతో రావాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జమ్మలమడుగు మండలం సుగమంచిపల్లె గ్రామానికి చెందిన సుమారు 15 సంవత్సరాల బాలుడు తప్పిపోయాడని, బాలుని ఆచూకీ కోసం తమను సంప్రదించాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుభాష్ యాదవ్ తెలిపారు. ఆయన వివరాల మేరకు జమ్మలమడుగు ప్రాంతంలో బాలుడు తిరుగుతున్నాడని పోలీసులు గుర్తించి కడపలోని బాలల సంక్షేమ సమితిలో హాజరు పరిచారన్నారు. బాలునికి మాట, వినికిడి లోపం ఉందని, కుటుంబ వివరాలు, చిరునామా చెప్పలేకపోతున్నాడన్నారు. బాలుడిని కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంచామన్నారు. బాలునికి సంబంధించిన తల్లిదండ్రులు, ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా తగిన ఆధారాలతో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 7680820205 లేదా 9948779114 నెంబరులో సంప్రదించాలన్నారు.

రక్తగ్రూపు తెలుసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ తమ రక్త గ్రూపును తెలుసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ బాలికల కళాశాల ప్రిన్సిపల్ సూర్యారావు తెలిపారు. జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక జూనియర్ బాలికల కళాశాలలో ప్రాజెక్ట్ ఔషధ రక్తగ్రూపు నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారం అందించారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం క్రీడాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్మీ అధికారి కల్నల్ మధుమిత, వాలీబాల్ అంతర్జాతీయ క్రీడాకారిణి వసుమతిలు ముఖ్యఅతిథులుగా విచ్చేసి క్రీడాజ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కల్నల్ ఎ. శేఖర్ మాట్లాడారు. అనంతరం క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

సామాజిక న్యాయ మహా శిల్పం పోస్టర్లు ఆవిష్కరణ

కడప కార్పొరేషన్ : సామాజిక న్యాయ మహా శిల్పం డా. బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం ఆవిష్కరణ కార్యక్రమాన్ని దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపం వద్ద వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ రాజ్యాధికారం దిశగా వారిని చేయిపట్టి నడిపిస్తున్నారన్నారు. డా. బీఆర్ అంబేడ్కర్ కన్న కలలను నిజం చేసేలా పాలన సాగిస్తున్నారన్నారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయడంలో భాగంగా ఈనెల 19వ తేదీన ఆయన 125 అడుగుల మహా శిల్పాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేయబోతున్నారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని అంబేడ్కర్ వాదులంతా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య, వైఎస్సార్‌సిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, నాయకులు లక్ష్మీనారాయణ, కంచుపాటి బాబు, కోలా కొండయ్య, సుబ్బరాయుడు, ఎస్ సుబ్బారెడ్డి, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

అంబేడ్కర్ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకుపోవాలి

భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకుపోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, 4వ డివిజన్ ఇన్‌చార్జి ఆర్‌వీ రమణ అన్నారు. ఈనెల 19వ తేది విజయవాడలో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భంగా బుధవారం స్థానిక బుడ్డాయపల్లిలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4వ డివిజన్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలు అత్యధిక సంఖ్యలో ఉన్నారని, వారంతా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఆర్ఐ విశ్వనాథరెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, హబీబ్, యశ్వంత్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న బుడ్డాయపల్లె ప్రజలు

ఎల్ఐసీ వేతన సవరణలో జాప్యం తగదు


నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగ సంఘ నాయకులు

కడప కల్చరల్ : ఎల్ఐసీ యాజమాన్యం వేతన సవరణ కోసం చర్చలు ప్రారంభించాలని ఎల్ఐసీ సిబ్బంది సంఘాల జాయింట్ ఫ్రంట్ నాయకులు జె.చంద్రపాల్, ఎ.రఘునాథ్ రెడ్డి, సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం కార్యాలయ ప్రాంగణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ డిసెంబర్‌లో జరగాల్సిన చర్చలను అర్ధాంతరంగా యాజమాన్యం వాయిదా వేసిందన్నారు. సిబ్బంది అంశాలలో ఇటీవల యాజమాన్యం ప్రదర్శిస్తున్న ఏకపక్ష వైఖరిని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ల నాయకులు సుధీకర్, ఎల్లారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, అక్బర్ బాషా, అమీనా పర్వీన్, సరళ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

4జీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : స్వదేశీ సాంకేతికతతో త్వరలో వస్తున్న బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ డివిజన్ ఇంజనీర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు నగరంలో ఆ సంస్థ ఉద్యోగులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ హై స్పీడ్ భారత్ ఫైబర్ నెట్ అతి తక్కువ ధరల్లో ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ డివిజనల్ ఇంజనీర్ లక్ష్మానాయక్, ఏజీఎం అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'సీతారామయ్య'కు ఘన నివాళి


సీతారామయ్యకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

కడప కల్చరల్ : పర్యాటక ప్రముఖుడు సిద్దవటం సీతారామయ్యకు శిష్యగణం ఘనంగా నివాళులర్పించింది. బుధవారం ఆశారేఖ ఫౌండేషన్ చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి ఆధ్వర్యంలో కడప నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి సీతారామయ్యకు ఘన నివాళి అర్పించారు. ఇంటాక్ పూర్వ అధ్యక్షులు ఎస్.ఎలియాస్‌రెడ్డి, పూర్వ కోకన్వీనర్ వేణుగోపాల్, లయన్ కె.చిన్నపరెడ్డి, పోతుల వెంకట్రామిరెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు పాల్గొన్నారు. కాగా నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆ కేంద్రం సంచాలకుడు పి.రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సీతారామయ్య మృతికి ఘన నివాళులర్పించారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట


ఆలయంలో స్వామివారి మూలవిరాట్

పులివెందుల టౌన్ : పట్టణంలోని నగరిగుట్టలో పూర్వం నుంచి ఉన్న పీర్లచావిడి, శ్రీఆంజనేయ స్వామి దేవస్థానాలు ఉన్నాయి. పీర్ల చావిడిని పాడా నిధులతోనూ, దేవాదాయ ధర్మదాయ శాఖ ద్వారా శ్రీఆంజనేయస్వామి దేవస్థానాలను వైఎస్ కుటుంబ సభ్యుల సహకారంతో సర్వాంగ సుందరంగా పునః నిర్మించారు. మూడు రోజుల నుంచి శ్రీఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా జరిగాయి. చివరి రోజైన బుధవారం ఆంజనేయ స్వామి వారి యంత్ర ప్రతిష్ట, బింబ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, శిఖల కలశ, గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట, మహా పూర్ణాహుతి నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు పార్నపల్లె కిశోర్, లక్ష్మీప్రసన్న దేవిలు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన నిర్వహించారు. సాయంత్రం ఆంజనేయస్వామి స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


పెండ్లిమర్రిలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పెండ్లిమర్రి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3వేలు పెంచిన సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించి సామాజిక సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మండలంలో నూతనంగా 127 పింఛన్లు మంజూరైయ్యాయన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3వేలు పెంచారన్నారు. గతంలో చంద్రబాబు హయంలో రూ.1000 పింఛన్ ఉంటే ఎన్నికల సమయంలో రూ.2వేలు చేశారన్నారు. వృద్ధాప్యంలో అవ్వ, తాతలు ఇబ్బందులు పడకూడదని దానిని జగన్ విడతల వారిగా రూ.3 వేలు పెంచారన్నారు. ఈ విషయాన్ని పింఛన్ దారులు గుర్తించుకోవాలన్నారు. రాష్ట్రంలో నవరత్న పథకాల అమలుతో సువర్ణ పాలన సాగుతోందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి తలుపు తట్టి పింఛన్ అందజేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, గంటల తరబడి పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపు కాసేవారని గుర్తు చేశారు. ఇన్ని చేసిన జగనన్నను మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రారెడ్డి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, నాగిరెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : మండలంలో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నచెప్పలి (ఓసీ-మహిళ), కమలాపురం-2(ఎస్సీ-జనరల్), పందిళ్లపల్లె(ఎస్సీ జనరల్) భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె అందులో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈనెల 12వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 17వ తేదీన నిర్వహించే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు హాజరు కావాలన్నారు.

నివాళి

చెన్నూరు : చెన్నూరు పార్కు వీధికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు తమ్మిశెట్టి రమేష్ మాతృమూర్తి తుమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తమ్మిశెట్టి రమేష్ ఇంటికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

సిద్దవటం : బొగ్గిడివారిపల్లి గ్రామ పంచాయతీలోని పేద ప్రజలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు దాత కుప్పాల వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి వేడుకల్లో భాగంగా బొగ్గిడివారపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆకురోపల్లి, నిర్మలగిరి కాలనీ, గంగానగర్, కొమ్మనాయునిపల్లి, గ్రామాలకు చెందిన పేదలకు అందించారు.

ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల నిరసన

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హెచ్‌పీసీఎల్ వద్ద బుధవారం హెచ్‌పీసీఎల్ ట్యాంకర్ల డ్రైవర్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ షరీఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో జీఓ నెంబర్ 106ను రద్దు చేయాలని ప్రధాని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా డ్రైవర్‌లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా షరీఫ్ హుస్సేన్ మాట్లాడుతూ జీఓ నెంబర్ 106 వల్ల డ్రైవర్లు, క్లీనర్‌లకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. వస్తువులనైనా వివిధ పట్టణాలకు తీసుకు వెళ్లాలంటే కచ్చితంగా రవాణా చేయడానికి డ్రైవర్‌లు అవసరమని ప్రధాని ఈ చీకటి జీఓను తీసుకురావడం వల్ల తాము చాలా నష్టపోతామన్నారు. కార్యక్రమంలో ట్యాంకర్ల డ్రైవర్‌లు, క్లీనర్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లెలో బుధవారం రాత్రి పెనుగొండ బాబా పక్రుద్దీన్ ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా బా సమాధి వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, సర్పంచ్ షమీమ్‌బాను, ఉప సర్పంచ్ మాబుసాబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వనరులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : వైవీయూలోని వనరులను సద్వినియోగం చేసుకుని గొప్పవారిగా తయారవ్వాలని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం వైవీయూలోని ఏపీజే అబ్దుల్ కలాం ప్రాంగణంలో నూతన విద్యార్థులకు పరిచయ, ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ప్రపంచ అవసరాలకు తగ్గట్టు ఉత్తమ విజ్ఞానవంతులైన పౌరులుగా, పరిశోధకులుగా తీర్చిదిద్దడమే విశ్వవిద్యాలయ లక్ష్యమన్నారు. క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ పోటీప్రపంచానికి తగ్గట్టు చదవాలని సూచించారు. గ్రంథాలయంలో వేల పుస్తకాలు, జర్నల్స్ ఉన్నాయని, నిపుణులైన అధ్యాపకులు, పరిశోధకుల సహకారం అందిపుచ్చుకోవాలని సూచించారు. వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి విశ్వవిద్యాలయంలో లభించే సౌకర్యాలు, వనరులు, కోర్సుల గురించి అవగాహన కల్పించారు. కడప జైళ్ల సూపరింటెండెంట్ ఐఎస్‌హెచ్ ప్రకాష్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పుత్తా పద్మ, అకడమిక్ డీన్ ఆచార్య ఏజీ దాము, మిస్టర్ వి. ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ వై. భాస్కర్ వర్మ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రేరణ నింపారు. అనంతరం వైవీయూ సాంస్కృతిక విభాగం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో మరో అడుగు ముందుకు


మండలస్థాయి పోటీలను ప్రారంభిస్తున్న సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి

కడప స్పోర్ట్స్ : గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో మరో అడుగు ముందుకు పడింది. ఇప్పటి వరకు సచివాలయస్థాయి పరిధిలోనే పోటీలు నిర్వహించగా, సచివాలయస్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాజట్లు తదుపరి స్థాయి పోటీలకు సన్నద్ధమయ్యారు. దీంతో బుధవారం జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో మండలస్థాయి పోటీలు నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ సచివాలయస్థాయి విజేత జట్ల మధ్య పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కాగా చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని ఊటుకూరులోని కేవీకే అగ్రికల్చర్ క్రీడామైదానంలో నిర్వహించిన మండలస్థాయి క్రీడాపోటీలను జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి ప్రారంభించారు. టాస్ వేసి క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రికెట్ పోటీలను ప్రారంభించారు.

సంక్రాంతి సంబరాలు


కళాశాలలో సంక్రాంతి సంబరాలు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి శోభ కనిపించేలా కళాశాల ఆవరణాన్ని అందంగా తీర్చిదిద్దారు. అనంతరం భోగిమంటలు వేసి సందడి చేశారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా బహుమతులు అందజేశారు.

ముగ్గుల పోటీ

కడప కల్చరల్ : సంక్రాంతిని పురస్కరించుకుని బుధవారం కడప నగరం మద్రాసురోడ్డులోని మహిళా సమాజ్ భవనంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఆ కార్యక్రమాన్ని ఆర్తీ ఉమెన్ సెంటర్ చైర్మన్ వి.సంధ్య ప్రారంభించి మాట్లాడారు. మహిళల సృజనాత్మక శక్తిని వ్యక్తం చేసుకునే అవకాశం ఈ ముగ్గుల పోటీ ద్వారా వస్తుందన్నారు. స్థానిక రాజు భద్రావతి నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ మాధవి, భాగ్యమ్మలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలైన జి.శ్వేత, సుప్రజ, వైష్ణవిలకు నగదు బహుమతులు అందజేశారు.


ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

13 నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఏఓ పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈనెల 13న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ముగ్గుల పోటీ నిర్వహిస్తామన్నారు. రంగుపొడులు, ఇతర సామాగ్రి వారే తెచ్చుకోవాలన్నారు.

మొదటి మూడు బహుమతులు ఉంటాయన్నారు. అదేరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. 14న గాలిపటాల పోటీ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. 16న సాయంత్రం 5 గంటల నుంచి సంప్రదాయ వస్త్రధారణ పోటీలు ఉంటాయన్నారు. మూడు నుంచి ఎనిమిది సంవత్సరాలలోపు వయస్సు గల వారికి మాత్రమే అనుమతి ఉంటాయన్నారు. ఈ సందర్భంగా శిల్పారామంలో అన్ని రకాల వినోద కార్యక్రమాలతో ఎగ్జిబిషన్ నిర్వహిస్తామన్నారు. పోటీదారులు 88866 52038, 97030 75636 నెంబర్లలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

కల్యాణం.. కమనీయం


ప్రత్యేక అలంకరణలో గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర బాలాజీ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు


కమలాపురం: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉత్తమారెడ్డి

కమలాపురం : స్థానిక సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో ఎంపీడీఓ జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం.. ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి బ్యాటింగ్ చేసి ప్రారంభించి మాట్లాడారు. యువకులనుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొనే విధంగా ఈ ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించడం హర్షణీయం అన్నారు. క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింట్, వాలీబాల్, ఖో-ఖో క్రీడలను నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రైజ్ మనీతో పాటు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తన సొంత నిధులతో ప్రైజ్ మనీ ప్రకటించడంతో నియోజవకర్గ క్రీడాకారుల్లో మరింత ఉత్సాహం నెలకొందన్నారు. కమలాపురం నియోజకవర్గ టీమ్ సభ్యులు రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, చెన్న కేశవరెడ్డి, నిఖిల్‌రెడ్డి, గండి భాస్కర్, ఎంపీడీఓ జ్యోతి, ఎంఈఓ బేబి, ఇతర అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలస్థాయి పోటీలను రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాపురెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొనాలని వారు కోరారు. పోటీల్లో మంచి ప్రతిభ కనబరచి వీరపునాయునిపల్లె మండలాన్ని రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. క్రికెట్ పోటీల్లో తంగెడుపల్లె, గంగిరెడ్డిపల్లె, ఎస్.పాలగిరి, అనిమెల, మొయిళ్లచెరువు, వీరపునాయునిపల్లె గ్రామాలకు చెందిన జట్లు పాల్గొనగా తంగెడుపల్లె, ఎస్. పాలగిరి, వీరపునాయునిపల్లె జట్లు విజయం సాధించాయి. బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బాలుర విభాగంలో గంగిరెడ్డిపల్లె, ఎస్.పాలగిరి, ఉరుటూరు గ్రామాలకు చెందిన జట్లు పాల్గొనగా ఉరుటూరు జట్టు విజయం సాధించిందని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

వల్లూరులో..

వల్లూరు : ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా మండలంలో బుధవారం నిర్వహించిన పలు క్రీడలు ఉత్సాహంగా సాగాయి. ఏ ఓబాయపల్లెలోని క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వల్లూరు జట్టు మొదటి స్థానంలో నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో తప్పెట్ల జట్టు మొదటి స్థానంలో నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో లేబాక జట్టు మొదటి స్థానంలో నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. మండల స్పెషలాఫీసర్ బ్రహ్మయ్య క్రీడా పోటీలను పరిశీలించారు. క్రీడా కారులను అభినందించారు. ఎంపీడీవో జయశ్రీ, ఈవోపీఆర్‌డీ ప్రసాద్ క్రీడా పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రత్నరాజు పాల్గొన్నారు.